సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికింది.



జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హడలెత్తించిన కొండచిలువ



కొండచిలువతో అటవీశాఖ ఉద్యోగి

ఓడీచెరువు : మండలంలోని తంగేడుకుంట పంచాయతీ బలిజపల్లిలో భారీ కొండచిలువ అందరినీ హడలెత్తించింది. గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తి పొలంలో 12 అడుగుల భారీ కొండచిలువ కనపడింది. గురువారం రాత్రి నుంచి కదలకుండా అక్కడే ఉండిపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు కొండచిలువను పట్టుకుని కారుణ్య సొసైటీకి అప్పగించారు.

ఓనం వేడుకలు ప్రారంభం



సంగీత కచేరి నిర్వహిస్తున్న హరిరాగ్ నందన్ బృందం

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో కేరళీయుల పవిత్ర పర్వదినమైన ఓనం వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఓనం వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల్లోని కేరళీయులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహా సమాధిని కేరళ సంస్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా ముస్తాబు చేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సత్యసాయి భక్తురాలు ప్రొఫెసర్ సరితా అయ్యర్ ఓనం పర్వదిన విశిష్టతను వివరించడంతో పాటు సత్యసాయి బోధనలను భక్తులకు వివరించారు. జీవితంలో విద్య ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం సంగీత విద్వాంసుడు హరిరాగ్ నందన్ బృందం నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది.

15న పశుశాఖ అసిస్టెంట్లకు శాఖాపరమైన పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల నియమితులైన 449 మంది విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ)కు ఈ నెల 15న శాఖాపరమైన పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం జరిగే పరీక్షకు సంబంధించి ఇప్పటికే అందరికీ హాల్‌టికెట్లు పంపిణీ పూర్తయిందన్నారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల్లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. మొబైల్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.



వైద్య విద్యార్థులకు అన్యాయం

వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు కూటమి సర్కార్ నిర్లక్ష్యం వల్ల అన్యాయం జరుగుతోంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆనాడు వైఎస్ జగన్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మెడికల్ కళాశాలల నిర్మాణానికి పూనుకున్నారు. అవన్నీ అందుబాటులోకి వచ్చి ఉంటే.. ఎందరో పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కేవి. కానీ ఇప్పుడు కూటమి సర్కార్ వాటిని ప్రైవేటుపరం చేయాలని భావిస్తుండటం దుర్మార్గం. ఈ చర్యలను యావత్ రాష్ట్ర ప్రజానీకం అడ్డుకోవాలి. మన జిల్లాలోని పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణ పనులూ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి

– అంజనరెడ్డి, అడదాకులపల్లి, పెనుకొండ మండలం





విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ వైద్య విద్యను నిరుపేదలకు దూరం చేస్తోంది. జగన్ సర్కార్ హయాంలో చేపట్టిన మెడికల్ కళాశాలల నిర్మాణాలను కూటమి సర్కార్ కావాలనే అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ మెడికల్ కళాశాలలన్నీ అందుబాటులో ఉండి ఉంటే నేడు వైద్య విద్యార్థులకు 1800 సీట్లు అదనంగా దక్కేవి. తక్కువ ఖర్చుతోనే ఎందరో పేద విద్యార్థుల వైద్యవిద్య కల సాకారమయ్యేది. కానీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో వైద్యవిద్య నిరుపేదలకు అందని ద్రాక్షగా మారుతోంది. ఇప్పటికైనా చంద్రబాబు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ కళాశాలపై దృష్టి సారించాలి.

–ఎ.వేమ నారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, పుట్టపర్తి

పురం.. నిమజ్జనం

దీజేల హోరు.. డప్పు దరువులు...బాణాసంచా మిరుమిట్లు.. చిన్నా,పెద్దా చిందులు.. గణపతి బప్పా మోరియా నినాదాలు... కలగలిపి హిందూపురం ఆధ్యాత్మిక సాగరంగా మారింది. ఎప్పటిలాగే ఈసారి వినాయక నిమజ్జనం కమనీయంగా సాగింది. చవితి రోజున మంటపాల్లో కొలువుదీరి పూజలందుకున్న బొజ్జ గణపయ్య శుక్రవారం నిమజ్జనానికి బయదేరగా.. ఊరంతా ఆనంద తాండవమాడింది. శోభాయాత్రలో అందరూ రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ గణేశుడిని గంగఒడికి చేర్చారు.

గణపతి బప్పా మోరియా...

- హిందూపురంలో వైభవంగా వినాయక నిమజ్జనం
- కమనీయంగా సాగిన శోభాయాత్ర
- నృత్యాలతో పట్టణాన్ని హోరెత్తించిన యువత



హిందూపురం ప్రధాన వీధిలో సాగుతున్న గణనాథుల శోభాయాత్ర

హిందూపురం: వినాయక ఉత్సవాలకు రాష్ట్రంలోనే పేరుగాంచిన హిందూపురంలో శుక్రవారం నిమజ్జనం కమనీయంగా సాగింది. దాదాపు 150 విగ్రహాలతో నిర్వహించిన శోభాయాత్ర భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం పంచింది. కుల,మతాలకు అతీతంగా తరలిరావడంతో సర్వమత సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది.

వైభవంగా ప్రారంభం

పట్టణంలో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నిర్ణయించిన శుభ ఘడియల్లో వినాయకుడి విగ్రహాలను శోభాయాత్రకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథులను కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్రలో డీజేలు, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ యువత కేరింతలు కొట్టారు.

ఎటు చూసినా జనమే

వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ఎటు చూసినా జనమే కనిపించారు. చిన్నా, పెద్దా అంతా ప్రధాన వీధుల్లోకి వచ్చారు. రహదారికి ఇరువైపులా నిలబడి శోభాయాత్ర తిలకిస్తూ కనిపించారు. అయితే ప్రారంభమైన కొద్దిసేపటికే వరుణుడు పలకరించడంతో భక్తులంతా కాసేపు సేదతీరారు. అనంతరం మళ్లీ ఉత్సాహంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గుడ్డం కోనేరులో క్రేన్‌లతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటినా సగం విగ్రహాలు కూడా నిమజ్జనం కాలేదు. భక్తులకు పలువురు అన్నదానం చేశారు.



భక్తుల నీరాజనాల మధ్య నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్న



గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో చర్చిస్తున్న డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్న

వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్న భద్రతా చర్యలను పర్యవేక్షించారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో చర్చించి నిమజ్జనానికి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ముగ్గురు ఏఎస్పీలు, 30 మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, 1,200 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.



యువతి ఆనంద తాండవం



శోభాయాత్రలో యువత సందడి



వినాయక నిమజ్జనంలో కళాకారుల ప్రదర్శన



నృత్యాలు చేస్తున్న యువతులు



నిమజ్జనానికి తరలుతున్న జటాధారి గణేశుడు

తాగినోడికి తాగినంత

- ఉమ్మడి జిల్లాలో విరివిగా మద్యం
- 192 నుంచి 247కు పెరగనున్న దుకాణాలు
- ఇప్పటికే మినీ బార్లుగా మారిన హోటళ్లు, ధాబాలు
- రోజుకు రూ.5 కోట్ల దాకా పెరిగిన మద్యం వినియోగం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని ఇకపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగినోడికి తాగినంత అన్నట్టు మారనుంది. ఇన్నాళ్లూ మద్యం నియంత్రించాలన్న ఉద్దేశంతో తక్కువ షాపులు నిర్వహించడం, బహిరంగ మద్యపానం నిర్మూలించడం చేశారు. కానీ టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడి మద్యానికి తెరలేపింది. కొత్త ఎక్సైజ్ పాలసీ రాకముసుపే హోటళ్లు, ధాబాలు మినీ బార్లుగా మారిపోయాయి. ఎక్కడికక్కడ మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా మద్యం సేవిస్తున్నారు.

కొత్తగా 55 వైన్ షాపులు..

అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ వస్తుందని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అదనంగా 55 వైన్ షాపులు ఏర్పాటవుతున్నాయి. ప్రస్తుతం 192 షాపులు ఉండగా, ఈ సంఖ్యను 247కు పెంచనున్నారు. దీనిపై జిల్లా అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ అధికారులను నివేదిక కోరారు. 1997 తర్వాత ఎన్ని షాపులు ఉన్నాయో ఆ ప్రకారం కొత్తగా షాపులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు.

పర్మిట్ రూములకు అనుమతి!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములను ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇదేగనుక జరిగితే ఇక ఎక్కడ పడితే అక్కడ మద్యం విచ్చలవిడి అవుతుంది. ఓ వైపు పర్మిట్ రూములు, మరోవైపు బార్లు, ఇవన్నీ కాకుండా బెల్టుషాపులు.. వెరసి ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ మద్యం ఏరులై పారే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే ధాబాలు, హోటళ్లు బార్లను తలపిస్తున్నాయి. ఎక్సైజ్, సెబ్, పోలీసు అధికారులు హోటళ్ల నిర్వాహకులతో లాలూచీ పడి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం నిరంతరాయంగా తాగిస్తున్నారు. లిక్కర్‌కు సంబంధించిన క్రైమ్ రేటు కూడా గడిచిన రెండు మాసాలుగా పెరిగినట్టు తేలింది.

రోజూ రూ.5 కోట్ల మద్యం వినియోగం..

జూన్‌కు ముందు ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.3.5 కోట్ల విలువైన మద్యం వినియోగం అయ్యేది. ఇప్పుడది రూ.5 కోట్లకు చేరుకుంది. వచ్చే నెల నుంచి మద్యం చీప్ బ్రాండ్‌లు పెరగనుండటంతో మద్యం వినియోగం మరింతగా వినియోగం అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇకపై పర్మిట్ రూములు, బెల్టుషాపుల ద్వారా మారుమూల గ్రామాలకు కూడా మద్యం అందుబాటులోకి వచ్చేలా చేస్తున్నారు. రానున్న రోజుల్లో తాగినోడికి తాగినంత అన్నట్టు మద్యం వినియోగం జరగనుందని చర్చ జరుగుతోంది.

ఎక్సైజ్ సర్కిళ్ల వారీగా మద్యం షాపులు ఇలా..

సర్కిల్	మద్యం షాపుల సంఖ్య
అనంతపురం	47
సీకే పల్లి	04
ధర్మవరం	19
గుత్తి	20
గుంతకల్లు	15
హిందూపురం	23
కదిరి	10
కళ్యాణదుర్గం	09
కంబదూరు	05
కణేకల్లు	08
మడకశిర	09
పెనుకొండ	14
పుట్టపర్తి	05
రాయదుర్గం	14
శింగనమల	09
తాడిపత్రి	22
తనకల్లు	05
ఉరవకొండ	09

రెండు రోజులే గడువు!

- ఈ–క్రాప్ నమోదుకు రేపటితో ఆఖరు
- ఇప్పటికే 97 శాతం పూర్తి చేసిన అధికారులు
- ఈ–కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచన



ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాల నమోదు (ఈ–క్రాప్)కు మరో రెండు రోజులే గడువు ఉంది. ఈనెల 15వ తేదీ (ఆదివారం)తో ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియనుండగా, అధికారులు ఇప్పటివరకూ 97 శాతం పూర్తి చేశారు. మిగతా 3 శాతం పంటల వివరాల నమోదుకు చర్యలు చేపట్టారు. అయితే రైతులు ఈ–కేవైసీ చేయించుకుంటేనే ఈ–క్రాప్ ప్రక్రియ పూర్తయినట్లు భావించాలని అధికారులు చెబుతున్నారు.

4,07,545 ఎకరాల్లో పంటల సాగు

ఖరీఫ్‌లో 1,51,265 మంది రైతులు 4,07,545 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీఆర్‌ఓలు ఇప్పటివరకు 3,95,190 ఎకరాల్లోని పంటల వివరాలను నమోదు చేశారు. అధికారులు పంటను ఫొటో క్యాప్చర్ చేయగానే, రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతు వివరాలు, గ్రామం, సర్వే నంబర్, ఆధార్ వివరాలు నమోదు చేయించుకోవాలి. కౌలు రైతులు సైతం తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. అనంతరం వేలిముద్ర వేస్తే ఈ–కేవైసీ పూర్తవుతుంది. కానీ దీనిపై సరైన అవగాహన లేక 30 శాతం మంది రైతులు మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నారు.

ఈ–క్రాప్‌తో ప్రయోజనాలు

ఈ–క్రాప్ వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం వల్ల సదరు రైతులు పంటల బీమా, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, సున్నావడ్డీ, బ్యాంకు రుణాలు, పంటల కొనుగోలు, రాయితీపై ఎరువులు, పురుగు మందులు, పెట్టుబడి సాయం తదితర వాటికి అర్హత సాధిస్తారు. ఈ–క్రాప్ చేయించకపోతే ఏ ఒక్క పథకమూ రైతుకు అందే అవకాశం లేదు. అందువల్ల రైతులంతా తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో పంటల సాగు..ఈ–క్రాప్ నమోదు వివరాలు ఇలా...

డివిజన్	సాగు చేసిన భూమి (ఎకరాలు)	ఈ–క్రాప్ నమోదు (ఎకరాలు)
ధర్మవరం	1,05,748	1,01,666
హిందూపురం	50,092	49,010
కదిరి	1,02,502	97,651
మడకశిర	82,042	80,887
పెనుకొండ	67,161	65,976
మొత్తం	4,07,545	3,80,596



‘ప్రభుత్వ నిర్ణయం కరెక్ట్ కాదు’

కొత్తగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటైతే అదనంగా మెడికల్ సీట్లు వస్తాయి. దీంతో ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది. నూతన మెడికల్ కళాశాలలు ప్రారంభించి సీట్లు పెంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే ఇలా రద్దు చేయాలని లేఖ రాయడం తప్పుడు నిర్ణయమే. ఒకరకంగా చెప్పాలంటే ఈ ప్రభుత్వం పేద బిడ్డలకు వైద్య విద్యను దూరం చేస్తోంది. ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– పి.ఆత్మారెడ్డి, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, కదిరి



మాలాంటి పేదలకు తీరని నష్టం



పెనుకొండలో మెడికల్ కళాశాలను వెంటనే పూర్తి చేయడంతో పాటు ప్రైవేట్ పరం చేయకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే నాలాంటి పేద, మధ్య తరగతి విద్యార్థులు చాలా నష్టపోతాం. నీట్ పరీక్ష కోసం కోచింగ్ తీసుకున్నా. రూ.3 లక్షల ఖర్చు అయింది. ర్యాంక్ తక్కువ రావడంతో సీటు రాదని చెబుతున్నారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ కళాశాలలన్నీ ప్రారంభమై ఉంటే నాకు సీటు కచ్చితంగా వచ్చి ఉండేది.

– ఇ.తిప్పేస్వామి, నీట్ విద్యార్థి,బంగారుపాళ్యం, అమరాపురం మండలం

క్లుప్తంగా

కొత్తచెరువులో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ఏర్పాటు

పుట్టపర్తి: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయ అధికారులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్‌కు సంబంధించి ఈ ఏడాది నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని వివరించారు.

ఇసుక అక్రమ తరలింపు వాహనాల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వివరాలను సీఐ ప్రభాకర్ వెల్లడించారు. చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లు, నాలుగు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం వాహనాలను సీజ్ చేస్తూ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బుల్లెట్ వాహనానికి నిప్పు



కాలిపోయిన బుల్లెట్ వాహనం

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లికి చెందిన మధుసూదన్ ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గురువారం రాత్రి తన ఇంటి ఎదుట రూ.2 లక్షల విలువైన బుల్లెట్ వాహనాన్ని మధుసూదన్ నిలిపి ఉండగా అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి పరిశీలించారు. కాగా, జనసేన పార్టీకి చెందిన బాధితుడు మధుసూదన్‌కు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులతో విభేదాలు ఉన్నాయి. దీంతో టీడీపీ నాయకులే ఉద్దేశపూర్వకంగా తన వాహనాన్ని తగులబెట్టి ఉంటారనే అనుమానాలను మధుసూదన్ వ్యక్తం చేయడం గమనార్హం.

కన్నీళ్లకే కష్టాలొచ్చే

రెక్కలు ముక్కలు చేసుకుంటూ రేయింబవళ్లు పని చేస్తేనే ఆ కుటుంబానికి పూట గడుస్తుంది. తండ్రి లేడు... తల్లి రెక్కల కష్టం పైనే ఆధారపడిన ఆ కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చిపడింది. తల్లి కష్టాన్ని చూసి చలించిపోయిన కుమార్తె... ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో స్థిరపడి అమ్మను బాగా చూసుకోవాలనుకుంది. ఆఖరుకు విధి చిన్నచూపు చూడడంతో మంచాన పడింది. రూ.లక్షల విలువైన చికిత్స చేస్తే తప్ప మామూలు మనిషి కాదన్న వైద్యుల మాటలు వినగానే ఆ తల్లికి కన్నీరు ఆగలేదు. ఆ కన్నీరు తుడిచే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది.

– ఎన్పీకుంట:

- న్యూరోజెనిక్ డిసీజ్‌తో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థిని
- నెల కిందట తీవ్ర జ్వరంతో ఇబ్బంది
- పేపర్‌ను సైతం పైకెత్తలేని దుస్థితి
- రక్తమార్పిడికి రూ. 4 లక్షల వరకు ఖర్చు
- చికిత్స చేయించలేని స్థితిలో తల్లి
- కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకోలు





మంచానికే పరిమితమైన షమీమ్ (ఇన్‌సెట్) తన కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్న తల్లి ఖాజాబీ

ఎన్పీకుంట మండలం పెడబల్లికి చెందిన ఎస్.ఖాజాబీకి తలుపుల మండలం బి.కొత్తపల్లికి చెందిన షాకీర్‌తో 2005లో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. షాకీర్ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 2011లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ముగ్గురు పిల్లల పోషణ భారం ఖాజాబీపై పడింది. కొన్నాళ్ల తర్వాత పెడబల్లిలోని పుట్టినింటికి వచ్చింది. అక్కడే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. పనులకు వెళితేనే పూట గడుస్తుంది. లేకపోతే పస్తులతోనే గడపాల్సి ఉంటుంది. తల్లి పడుతున్న కష్టాన్ని చూసిన రెండో కుమార్తె షమీమ్ తాను ఎలాగైనా ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో స్థిరపడాలని, తల్లిని బాగా చూసుకోవాలని అనుకుంది. ఇంటర్ పూర్తి చేసిన పెద్ద కుమార్తెకు ఏడాది కిందట ఖాజాబీ వివాహం చేసింది.

అరుదైన వ్యాధితో బాధపడుతూ...

ఎన్పీకుంటలోని కేజీబీవీలో షమీమ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తమ్ముడు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. నెల రోజుల క్రితం షమీమ్ తీవ్ర జ్వరంతో బాధపడింది. పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యుల సూచన మేరకు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి, అనంతరం స్విమ్స్‌లో చేర్పించింది. ఈ క్రమంలో చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ చేసిన తర్వాత న్యూరోజెనిక్ డిసీజ్‌తో షమీమ్ బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆర్థిక సాయం చేయాలనుకుంటే...	
పేరు	ఎస్.ఖాజాబీ
ఏపీజీబీ ఖాతా నంబర్	1909 454 9235
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	ఏపీజీబీ 0001064
ఫోన్‌పే నంబర్	91828 85369

నా బిడ్డను కాపాడండి...

న్యూరోజెనిక్ డిసీజ్‌తో బాధపడుతున్న షమీమ్‌కు రక్తమార్పిడి చేయాల్సి ఉందని, ఇందుకు రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చడం తనకు తలకు మించిన భారం కావడంతో ఆ నిరుపేద తల్లికి కన్నీరు ఆగలేదు. కనీస ఖర్చులకు సైతం చేతిలో డబ్బు లేకపోవడంతో ఆస్పత్రి నుంచి కుమార్తె డిశ్చార్జ్ చేయించుకుని ఇంటికి వచ్చింది. చదువుల్లో ఎంతో చురుకైన తన కుమార్తె జీవచ్ఛవంలా మంచాన పడి ఉండడం చూసి రోదించడం తప్ప మరేమీ చేయలని అసహాయ స్థితిలో ఉండిపోయింది. వ్యాధి బారిన పడినప్పటి నుంచి షమీమ్ సక్రమంగా కూర్చోలేకపోతోంది. చివరకు చిత్తు కాగితాన్ని సైతం పైకి ఎత్తలేని దుస్థితికి చేరుకుంది. అద్దె ఇంట్లో నివాసిస్తున్న ఖాజాబీకి సొంత ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు. కూలి పనికి వెళితే తప్ప పూట గడవని స్థితిలో ఉన్న ఆమె తనకు తెలిసిన వారినందరినీ డబ్బు సాయం చేయాలని అర్థిస్తోంది. తన కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటోంది.

యువకుడి దుర్మరణం



పవన్ మృతదేహం వద్ద రోదిస్తున్న ఈశ్వర్



పవన్ (ఫైల్)

బత్తలపల్లి: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని ఐదో రోడ్డు ఎంపీ కాలనీలో నివాసముంటున్న గుగ్గిళ్ల ఆంజనేయులు కుమారులు పవన్(27), ఈశ్వర్ చీరల వ్యాపారంతో కుటుంబానికి చేదోడుగా ఉన్నారు. రోజూ ద్విచక్ర వాహనంపై చీరలను గ్రామాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ఈ క్రమంలో శుక్రవారం వ్యాపార నిమిత్తం చీరలు తీసుకుని ద్విచక్ర వాహనంపై కదిరికి బయలుదేరారు. మార్గంమధ్యలో బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి వద్దకు చేరుకోగానే సర్వీసు రోడ్డు నుంచి పొలాలకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై శరవేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్‌ను గమనించేలోపు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్పగాయాలతో ఈశ్వర్ బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడిని ఆర్టీటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, పవన్‌కు భార్య స్వాతి, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

ఓడీచెరువు: స్థానిక చెరువు మరువ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు (50) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని టీబీ క్రాస్‌కు చెందిన శ్రీనివాసులుకు ఓడీచెరువు నివాసి బోయ శివమ్మతో వివాహమైంది. పెళ్లి తర్వాత ఇల్లరికం వచ్చి కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: హిందూపురం మండలం శిరేకోలం, ధనాపురం గ్రామాలకు చెందిన వ్యక్తుల మధ్య శుక్రవారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. పరస్పర దాడులకు పాల్పడిన వారు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథికి చెందిన కార్యకర్తలుగా తెలుస్తోంది. వినాయకుడి నిమజ్జనానికి సంబంధించి ఆయా గ్రామాలకు చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల మధ్య గురువారం రాత్రి వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో రాత్రి జరిగిన సంఘటన సాకుతో శుక్రవారం ఉదయం రూ.10 వేలు ఇచ్చే చెల్లించే అంశంపై నరసింహమూర్తి, శివకుమార్ మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం పరస్పర దాడులకు దారి తీసింది. తీవ్రంగా గాయపడిన నరసింహమూర్తి, శివకుమార్‌ని హుటాహుటిన హిందూపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై, శివకుమార్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జయలత తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నరసింహులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన కర్రెప్పగారి నరసింహులు (50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న నరసింహులకు భార్య నారాయమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. మరో ఇద్దరు తల్లిదండ్రులతోనే కలసి ఉంటున్నారు. కొన్నేళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న నరసింహులుకు కొన్ని నెలలుగా కిడ్నీలు సక్రమంగా పనిచేయక పోవడంతో డయాలసిస్ చేయించుకునేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఈ నెల 9న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు శుక్రవారం ఉదయం చెన్నేకొత్తపల్లి – పెనుకొండ మార్గంలోని కొండల్లో చెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న నరసింహులు మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కూడా అక్కడికెళ్లి మృతుడిని నరసింహులుగా నిర్ధారించారు. అనారోగ్య పరిస్థితులే ఇందుకు కారణమని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ర్యాప్తు చేపట్టారు.

జీఓ కాదు.. నిధులివ్వండి

- శ్రీసత్యసాయి నీటి ప్రాజెక్ట్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న శ్రీసత్యసాయి నీటి ప్రాజెక్టు కార్మికులు

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి ప్రాజెక్టుకు రూ.30 కోట్లు నిధులు ఇస్తున్నట్లు జీఓ ఇవ్వడం కాదు... ముందుగా నిధులు విడుదల చేసి ప్రకటనలివ్వాలంటూ ఆ ప్రాజెక్టు కార్మికులు శుక్రవారం ఉదయం అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నీటి ప్రాజెక్టుల కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. కార్మికుల వేతనం ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగితే జీఓ వచ్చింది కానీ, నిధులు ఇంకా రాలేదని చెబుతున్నారన్నారు. ప్రాజెక్టుకు రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ ఇవ్వడం బాగున్నా.. నిధులు విడుదల చేయకుండా మభ్య పెట్టడం సరికాదన్నారు. తక్షణం నిధులు విడుదల చేసి కార్మికులకు బకాయి పడిన వేతనాలు చెల్లించాలన్నారు. ఆలాగే కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ కల్పిస్తామంటూ గతంలో అధికారులు చేసిన అగ్రిమెంట్‌ని అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరమయ్యే వరకూ సమ్మెను కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

‘ఏ’వన్ బౌలింగ్

- తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకే కుప్పకూలిన ఇండియా–డీ
- మరో మ్యాచ్‌లో భారీ స్కోరు సాధించిన ఇండియా–సీ జట్టు
- దీటుగా జవాబిస్తున్న ఇండియా–బీ



అర్ధసెంచరీలు సాధించిన అభిమన్యు ఈశ్వరన్, జగదీశన్



బ్యాటర్‌ను రన్‌అవుట్ చేస్తున్న కీపర్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు



మ్యాచ్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు



జాతీయ పతాకంతో విద్యార్థుల సందడి

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన మైదానంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఇండియా–ఏ జట్టు బౌలర్ల ధాటికి ఇండియా–డీ జట్టు బ్యాటర్లు విలవిల్లాడారు. తొలి ఇన్నింగ్స్‌లో 52.1 ఓవర్ల వద్ద 183 పరుగులకు ఆలౌట్ అయ్యారు. జట్టులో దేవదత్ పడిక్కల్ 15 ఫోర్లతో 92 పరుగులు, హర్షిత్ రాణా 31, రికీ భుయి 23 పరుగులు చేశారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. ఇండియా–ఏ జట్టు బౌలర్లు ఖలీల్ అహమ్మద్, అకీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు సాధించి ఇండియా–డీ జట్టును కోలుకోలేని దెబ్బ తీశారు. మిగిలిన బౌలర్లు ప్రసిద్ధ కృష్ణ, తనుష్, సామ్స్ చెరో వికెట్ తీశారు.

ఇండియా–ఏ కు 107 పరుగుల ఆధిక్యత

8 వికెట్ల నష్టానికి 288 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన ఇండియా–ఏ జట్టు రెండు పరుగులు సాధించిన తర్వాత 290 పరుగులకు ఆలౌట్ అయింది. 89 పరుగులతో సెంచరీ దిశగా అడుగులు వేస్తున్న సామ్స్ ములానీ ఊహించని విధంగా హర్షిత్‌రాణా బౌలింగ్‌లో టైడ్ చేతికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 15 పరుగులతో ఖలీల్ అహమ్మద్ నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–డీ జట్టు పేలవమైన ఆటతీరుతో 52.1 ఓవర్ల వద్ద 183 పరుగులకు చతికిలబడింది. దీంతో ఇండియా ఏ జట్టు 107 పరుగుల ఆధిక్యత సాధించింది. ఇండియా డీ జట్టులో అథర్వ టైడ్ 4 పరుగుల వద్ద అహమ్మద్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. 14 పరుగుల వద్ద యష్‌దూబే.. అకీబ్‌ఖాన్ బౌలింగ్‌లో కుషగ్ర చేతికి చిక్కాడు. జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేలవమైన ఆట తీరుతో ఎలాంటి పరుగులు చేయకుండానే అహమ్మద్ బౌలింగ్‌లో అకీబ్‌ఖాన్ చేతిలోకి బంతిని కొట్టి పెవిలియన్ దారి పట్టాడు. 92 పరుగులతో సెంచరీ వైపుగా అడుగు వేస్తున్న దేవదత్ పడిక్కల్ ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో కుషగ్రకు క్యాచ్ ఇచ్చాడు. 5 పరుగుల వద్ద సంజూశామ్‌సన్.. అకీబ్ బౌలింగ్‌లో ప్రసిద్ధ్‌కృష్ణ చేతికి చిక్కాడు. రికీబుయ్ 23 పరుగులు చేసి అహమ్మద్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ అయ్యాడు. సరాన్ జైన్ 8 పరుగులు సాధించి కోటియన్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూ కాగా, 31 పరుగులు చేసిన హర్షిత్ రాణాను ములానీ క్లీన్ బౌల్డ్ చేశాడు. అర్షదీప్ ఎలాంటి పరుగులు చేయకుండా రన్‌అవుట్ కాగా, విద్వత్ కావేరప్ప రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–ఏ జట్టు ఆట ముగిసే సమయానికి 28.1 ఓవర్లకు వికెట్ కోల్పోయి 115 పరుగులు సాధించింది. ప్రథమ్‌సింగ్ 59 క్రీజ్‌లో ఉన్నాడు. 56 పరుగుల వద్ద మయాంక్ అగర్వాల్... శ్రేయస్ అయ్యర్ బౌలింగ్‌లో కాట్ అండ్ బౌల్డ్ అయ్యాడు.

అదరగొట్టిన ఇండియా–సీ

మరో మ్యాచ్‌లో ఇండియా–బీ జట్టుపై ఇండియా–సీ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో ఆల్‌రౌండర్ మనవ్ సుతార్ 82 (11 ఫోర్లు, 3 సిక్సర్లు) పరుగులు చేశారు. అన్షుల్ కాంభోజ్ 38, మయాంక్ మార్కండే 17 పరుగులు చేశారు. ఇండియా–బీ జట్టు బౌలర్లలో ముఖేష్ కుమార్ 4, రాహుల్ చహార్ 4 వికెట్లు, నవదీప్ సైనీ, నితీష్ కుమార్ రెడ్డి చెరో వికెట్ తీశారు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–బీ జట్టు దీటుగా జవాబిచ్చింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 51(4 ఫోర్లు, 1 సిక్సర్), నారాయణ్ జగదీశన్ 67 (8 ఫోర్లు) రాణించారు. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా–బీ జట్టు వికెట్ నష్టపోకుండా 124 చేసింది. జట్టులో అభిమన్యు 51, జగదీషన్ 67 పరుగులతో అజేయంగా నిలిచారు. 36 ఓవర్లు వేసిన ఇండియా–సీ జట్టు బౌలర్లు ఆరు ఎక్స్‌ట్రాలు ఇచ్చారు.



సిల్లీ పాయింట్‌లో క్యాచ్ పడుతున్న ఫీల్డర్